వరికి 'దోమపోటు'

- తప్ప, తాలుగా మారుతున్న గింజలు
- దిగుబడి తగ్గుతుందనే భయాందోళనలో రైతులు
- సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు


వరి మొదళ్లలో దోమ లార్వాలు


పొట్టపెల్లిలో దోమపోటు సోకిన వరి పంట

లక్ష్మణచాంద: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటకు దోమపోటు వస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల వరికోతలు ప్రారంభం కాగా.. ఆలస్యంగా వరినాట్లు వేసిన మరికొన్ని ప్రాంతాల్లో పంట ఇప్పుడిప్పుడే చివరి దశకు చేరుకుంటుంది. లక్ష్మణచాంద మండలంలోని 18 పంచాయతీల పరిధిలో 23 గ్రామాల్లో 12వేల ఎకరాలలో వరిపంట సాగు చేయగా.. సుమారు 150 ఎకరాల్లో వరకు పంటకు దోమ పోటు సోకిందని ఏవో వసంత్‌రావు తెలిపారు. పొట్టపెల్లి(కే), రాచాపూర్, చామన్‌పెల్లి గ్రామాల్లో తీవ్రంగా ఉందని రైతులు వాపోతున్నారు.

వాతావరణ మార్పులతోనే ..

సన్నరకాలు సాగు చేసిన వరిపొలాలు నెలరోజుల ముందు వరకు బాగానే ఉన్నాయి. రైతులు సైతం ఈసారి మంచి దిగుబడులు వస్తాయనుకున్నారు.. కానీ ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణం మారిపోయింది. వరిపొలాల్లో నీరు నిలిచి దోమపోటు తెగులు సోకిందని రైతులు పేర్కొంటున్నారు. దోమపోటుతో గింజ తప్ప, తాలుగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూచనలు చేస్తున్న అధికారులు..

వరిపొలాలకు దోమపోటు సోకుతుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో తిరుగుతూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏఈవోలు, ఏవో వరిపొలాలను పరిశీలించి తెగులు నివారణకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

నీటితడులు నిలిపివేసినా తగ్గడం లేదు



తాము సాగు చేస్తున్న వరిపొలాలకు దోమపోటు సోకింది. ఇప్పటికే కాలువ చేసి నీటితడులు నిలిపివేశాను. అయినప్పటికీ దోమ తీవ్రత తగ్గకపోవడంతో పంట పూర్తిగా నేల కొరిగింది. ఈసారి ఆశించిన దిగుబడి వచ్చేలా లేదు.

– ముత్యం, రైతు, రాచాపూర్

జాగ్రత్తలు తీసుకోవాలి

వాతావరణంలో తేమ, పొలంలో ఎక్కువ నీరు నిల్వ ఉంటే దోమపోటు తెగులు సోకే అవకాశం ఉంది. ఎక్కువగా యూరియాను వాడితే కూడా ఈ ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. రైతులు వెంటనే పొలంలోని నీరు బయటకు వెళ్లేలా కాలువ తీసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచన మేరకు మెట్రోజైన్‌ను 120 గ్రా. ఎకరానికి పిచికారీ చేయాలి. డైక్లోవాస్ 250ఎంఎల్, డైనెట్రోఫాన్‌ను ఎకరాకు 80 గ్రాములు పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

– వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

క్లుప్తంగా

పిడుగుపాటుకు ఎద్దు మృతి


మృతిచెందిన ఎద్దు

లోకేశ్వరం: మండలంలోని హథ్గాం పంచాయతీ పరిధిలోని పోట్‌పల్లి(ఎం) గ్రామంలోని బరడోల రమేశ్‌కు చెందిన ఎద్దు గురువారం పిడుగుపాటుతో మృతిచెందింది. మేతకు వెళ్లిన తన ఎడ్లను తీసుకొచ్చి ఇంటి వద్ద కట్టేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురువగా..ఎద్దుపై పిడుగు పడగా అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఘనంగా ఏక్తా దివస్

భైంసాటౌన్: భారత తొలి ఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ జయంతి పురస్కరించుకొని గురువారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రాష్ట్రీయ ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. అంతకుముందు బీజేపీ నాయకులు వల్లభాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పటేల్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ముధోల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం వల్లాభాయి పటేల్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, భూమేశ్, రమేశ్, శ్రీనివాస్, జీవన్, మోహన్, నరేశ్, సుదర్శన్ తదితరులున్నారు.

వెండిహారం బహూకరణ


హారం అందిస్తున్న వినోద్‌రావు దంపతులు

ఖానాపూర్: పట్టణంలోని జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయానికి శుక్రవారం ఖానాపూర్‌కే చెందిన నిర్మల్ ప్రధాన సెషన్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు –మంజుల దంపతులు కిలో వెండి హారం బహూకరించారు. ఈసందర్భంగా అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి బాబా ప్రతిమకు వెండి హారం అలంకరించారు. కార్యక్రమంలో అంకం రాజేందర్, అశోక్‌రావు, శేఖరయ్య, కరిపె శ్రీనివాస్, రామునాయక్, వెంకట్ మహేంద్ర, మడిగెల గంగాధర్, రంజిత్‌రావు తదితరులున్నారు.

'సర్వేకు సహకరించండి'

నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకు బీసీలు పూర్తి వివరాలను అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వేతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెరిగితే రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో అభ్యున్నతికి అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

కరెంట్‌షాక్‌తో గేదె మృతి

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో భూమన్నకు చెందిన గేదె కరెంట్ షాక్‌తో మృతి చెందింది. గురువారం పొలాల్లో మేత కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అవుతున్న తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి రవీందర్ పరిశీలించారు. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని భూమన్న వేడుకుంటున్నాడు.

క్రీడలతో స్నేహభావం


బహుమతులు అందిస్తున్న భీంరెడ్డి

మామడ: క్రీడలతో స్నేహభావం, పోటీతత్వం పెరుగుతుందని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి అన్నారు. మామడలో మాజీ ఎంపీటీసీ బాపయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ముగిశాయి. శుక్రవారం బహుమతుల పంపిణీ కార్యక్రమంలో చైర్మన్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చార్జీల పెంపు హర్షణీయం


చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద విద్యార్థుల ర్యాలీ

సారంగపూర్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచినందుకు కృతజ్ఞతగా శుక్రవారం చించోలి(బి) ఎక్స్‌రోడ్డు సమీపంలో ఉన్న ఎంజేపీ టీబీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డైట్ ఛార్జీలు నెలకు రూ.1500 నుంచి రూ.2100కు, కాస్మొటిక్ ఛార్జీలు రూ.275కు పెంచడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు డాక్టర్ విజయ్‌కుమార్, పురుషోత్తం, నాయిని శ్రీనివాస్, గణేశ్, శ్వేత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంజేపీ బీసీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులు స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దండారీ వేడుకల్లో పాల్గొన్న డీఆర్డీవో


గుస్సాడీలతో డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: మండలంలోని పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేట్‌లో గురువారం నిర్వహించిన దండారీ వేడుకల్లో డీఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆదివాసీలతో కలిసి గుస్సాడీ నృత్యాలు చేశారు. ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు. పునరావాస గ్రామస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారు ఆర్థిక ప్రగతి సాధించేలా చేయూతనిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కవిరాజు, ఈజీఎస్ ఏపీవో జయదేవ్, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పొలాలు


నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో గురువారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి వరిపొలాలు దెబ్బతిన్నాయి. సుమారు 40 ఎకరాల్లో పొలాలు నేలకొరిగాయి. శుక్రవారం దెబ్బతిన్న పంటలను బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ పరిశీలించారు. తడిసిన, నల్లబారిన ధాన్యం కొనుగోలు చేసి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర సమాచారం సేకరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్
- ఎన్యుమరేటర్లకు స్టేషనరీ సామగ్రి పంపిణీ


లక్ష్మణచాందలో సర్వే మెటీరియల్ అందిస్తున్న డీపీవో శ్రీనివాస్


ఖానాపూర్‌లో సామగ్రి అందిస్తున్న ఎంపీడీవో


సోన్: గంజాల్‌లో స్టేషనరీ వస్తువుల పంపిణీలో ఎంపీడీవో సురేశ్

లక్ష్మణచాంద: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇంటింటి సర్వేలో సమగ్ర సమాచారం సేకరించాలని డీపీఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వేకు అవసరమైన మెటీరియల్‌ను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 150 కుటుంబాలకో ఎన్యుమరేటర్‌ను నియమించామని.. ఇబ్బందులు కలగకుండా కార్యదర్శులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కుటుంబసభ్యుల వివరాలను జాగ్రత్తగా తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో రాధ, ఎంపీఓ అమీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కుటుంబసర్వేకు కావాల్సిన స్టేషనరీ సామగ్రి, ఫారాలను ఎంపీడీవో వెంకటరమేశ్.. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఆశవర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలకు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలస్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటూ తప్పులు లేకుండా ఫారం నింపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో సోలమాన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: ఎంపీపీ కార్యాలయంలో సర్వేకు అవసరమైన స్టేషనరీ సామగ్రిని శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, కార్యదర్శులు తదితరులున్నారు.

మామడలో..

మామడ: కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సిబ్బందికి సర్వేకు అవసరమైన సామగ్రి అందించారు. సందేహాలు నివృత్తి చేసి వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, ఎంపీఓ గంగాసాగర్‌రెడ్డి ఉన్నారు.

సోన్: 150 నుంచి 175 వరకు కుటుంబాలను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసి ఎన్యుమరేటర్‌కు సర్వే బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో సురేశ్ అన్నారు. మండలంలోని గ్రామాల్లో ఎన్యుమరేటర్లుగా నియమించిన అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కర్లకు స్టేషనరీ సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. ఏఎస్ఓ నిషిత, కార్యదర్శి రాణి, ఐ కే పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆచూకీ తెలపాలని ఆందోళన

- కడెం రేంజ్ కార్యాలయం ముట్టడించిన ఆదివాసీలు


ఆదివాసీలతో మాట్లాడుతున్న సీఐ సైదారావు

కడెం: ఆదివాసీ యువకుడి ఆచూకీ తెలపాలని మండలంలోని కొలాంగూడ వాసులు కడెం అటవీ రేంజ్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. గూడేనికి చెందిన కుమురం సంతోష్ అటవీ శాఖలో బేస్ క్యాంప్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 27న సంతోష్‌ను ఎఫ్ఎస్‌వో రవికుమార్ తీసుకెళ్లాడు. ఆరో జు నుంచి సంతోష్ తిరిగి ఇంటికి రాలేదు. పెద్దూర్ కలప కేసు విషయమై వాచర్ సంతోష్‌ను ఎఫ్ఎస్‌వో రవికుమార్ భయభ్రాంతులకు గురిచేసి కొట్టారని ఆదివాసీలు ఆరోపించారు. సంతోష్ ఆచూకీ తెలపాలని ఎఫ్ఎస్‌వో రవికుమార్‌ను నిలదీశారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఖానాపూర్ సీఐ సైదారావు కొలాంగూడ చేరుకుని వాచర్ సంతోష్ కుటుంబసభ్యులతో మాట్లాడారు. సంతోష్ ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

శుభ్రతపై దృష్టి సారించాలి

తానూరు: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మండలంలోని ఉమ్రి(కే) గ్రామం సందర్శించారు. పారిశుధ్య పనులు చేయిస్తూ గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. పల్లె ప్రకృతివనం పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది, మాజీ సర్పంచ్ మారుతి, వీవోఏ దత్తురాం, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి ఎంపికైన యువకుడికి సన్మానం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో దొంతుల లావణ్య-శంకర్ దంపతుల కుమారుడు భరద్వాజ్ నేవీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఇండియన్ నేవీ సీనియర్ సెకండరీ ఫలితాల్లో భరద్వాజ్ ఉద్యోగం సాధించాడు. శుక్రవారం యువకుడిని గ్రామస్తులు ఘనంగా సన్మానించి అభినందించారు.

రేపు కల్యాణం

పెంబి: మండలంలోని మందపల్లిలో భీమన్న దేవుడి ఉత్సవాలు వారంరోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గంగాస్నానం చేసి జలాలు తీసుకొచ్చేందుకు భక్తులు గోదావరికి బయలుదేరారు. గంగాస్నానం అనంతరం రాత్రి గ్రామానికి చేరుకొని ఆదివారం జాతర (కల్యాణ మహోత్సవం)నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్


కుంటాల: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


కడెం: లక్ష్మిసాగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శైలజ

కుంటాల: రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎంపీపీలు అప్క గజ్జారాం యాదవ్, జీవీ రమణారావు, డైరెక్టర్ సాయినాథ్, ఏఈవో గణేశ్, నిర్వాహకుడు శివాజీ పటేల్, గుద్దేటి నర్సయ్య, పసుల నవీన్, లక్ష్మణ్‌పటేల్, దిగంబర్‌పటేల్, వెంకట్ పాల్గొన్నారు.

కడెం: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామడుగు శైలజరమేశ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల్, లక్ష్మిసాగర్, బెల్లాల్, ధర్మాజీపేట్, నర్సింగాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్లు గొళ్ల వెంకటేశ్, మల్లేశ్, రాజం, భూషణం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, బొడ్డు గంగన్న, ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'సర్వే విధుల నుంచి మినహాయించాలి'


నిర్మల్‌లో వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నిర్మల్‌చైన్‌గేట్: సమగ్ర సర్వే విధుల నుంచి అంగన్‌వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు ఐసీడీఎస్ ఏపీడీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క టీచర్లతో సర్వే చేయించాలని చెప్పినా.. అంగన్‌వాడీ టీచర్లతో ఎందుకు చేయిస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నుంచి అంగన్‌వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, జిల్లా సహాయ కార్యదర్శి గంగామణి, బి.ప్రసాద, విజయ, సునీత, భూలక్ష్మి, అమూర్త, సరదా, పుష్ప, కవిత, రత్నమాల, కమల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగారాం పాల్గొన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: తమను కుటుంబ సర్వే విధుల నుంచి మినహాయించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే తమపై పని ఒత్తిడి ఉందని.. ఎన్యుమరేటర్‌గా తమను తప్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రేష్మా, వనిత తదితరులున్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు


బాలసదనంలో వేడుకలు నిర్వహిస్తున్న సభ్యులు


కుభీర్‌లోని ఓ దుకాణంలో లక్ష్మీపూజ


పూజలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్


పూజ చేస్తున్న బీజేపీ నేత మోహన్‌రావుపటేల్


తానూరులో పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వడ్యాల్‌తోపాటు ఇతర గ్రామాల్లో లక్ష్మీపూజలు చేశారు. అనంతరం స్వీట్లు పంచుకొని టపాసులు కాల్చారు.

నిర్మల్‌టౌన్: మండలంలోని కొండాపూర్ బాలసదనంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి హరికృష్ణ సహకారంతో గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. శ్రీనివాస్, కిషన్, బాలసదనం అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో శుక్రవారం దీపావళి పండుగ జరుపుకున్నారు. ఉదయం విఠలేశ్వర మందిరంలో నిర్వహించిన కాగడ హారతిలో భక్తులు పాల్గొన్నారు. ఇళ్ల వద్ద, వ్యాపార సముదాయాల్లో లక్ష్మీపూజ చేశారు.

కుంటాల /లోకేశ్వరం: కుంటాల, లోకేశ్వరం మండలంలోని రాయపూర్‌కాండ్లీ, ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, రాజూరా, పిప్రి, లోకేశ్వరం, నగర్, పుస్పూర్, మన్మద్, గడ్‌చాంద, పోట్‌పల్లి(బి), హవర్గ, హథ్‌గాం గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు.

భైంసాటౌన్: పట్టణంలో శుక్రవారం దీపావళి పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలను దీపాలు, విద్యుద్దీపాలతో అలంకరించుకున్నారు. సాయంత్రం లక్ష్మీపూజలు చేసి.. టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.మోహన్‌రావు పటేల్ తమ నివాసాల్లో లక్ష్మీ పూజలు చేశారు.

సారంగపూర్ మండలంలోని గ్రామాల్లో ఇళ్లను, ఆలయాలను సుందరంగా అలంకరించారు.

ఘనంగా మహాలక్ష్మి పూజలు

తానూరు: మండలకేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా వ్యాపారులు తమ దుకాణాల్లో రైతులు తమ ఇళ్ల వద్ద పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. శనివారం దీపావళి జరుపుకోనున్నారు.

చెక్కు అందజేత

తానూరు: మండలంలోని ఝరి(బి)కి చెందిన ఉండేపుడు సవితకు ఇటీవల రూ.26వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విఠల్ దేగాంలోని తన నివాసంలో లబ్ధిదారుకు చెక్కు అందజేశా రు. దిగాంబర్, లక్ష్మణ్, సాయినాథ్ ఉన్నారు.